# ★ బొమ్మల పెళ్లి ★

‘అబ్బాయి...మరీ...’

‘ఊ. ఏమిటీ...?’

‘మరే, మరే, నేను మగపెళ్లివారిని నువ్వేం ఎంచక్కా ఆడపెళ్లివారివి. ఏం?’

‘ఊహు. నేనే మగపెళ్లివారిని’

‘పోనీలే, అమ్మా, మరీ...’

‘ఊహు అదేమిటి? నేను మగవాడిని కనుక మగ పెళ్లి వారిని’

‘అయితే నేను ఆడను...’

‘పోనీ వెళ్లు. ఆడాళ్లు ఆడపెళ్లివారిగావుంటే బాగుంటుంది.’

‘నేను ఆడను హుఁ. వెళ్లిపోతాను. నీజతవుండను నీకు నాకు ‘కావు—కావు—కావు’

‘అమ్మాయీ!’

‘...............’

‘వెళ్లకే, రావే...’

‘ఊఁ ఎందుకూ మరీ’

‘నువ్వే వుండుగానే. పోనీ, నేనే ఆడపెళ్లివారిని. సరే మరి అమ్మనడిగి కందిపప్పు, అటుకులు తీసుకురావే.’

‘మరి బెల్లం.’

‘బెల్లం కూడాను.’

‘సరే.’

*   *   *

‘అబ్బాయీ!’

‘ఓయ్’

‘దబ్బునరా పెళ్లివేళ అవుతోంది’

‘అమ్మాయీ’

‘మరీ నేను బ్రాహ్మణ్ణి’

‘ఊ అల్లాగే’

‘నేను ఎంచక్కా మంత్రాలు చదువుతానే’

‘ఊ. పీటలమీదకూర్చోపెట్టీ మంత్రాలుచదువూ.’

‘కేశవా నారాయిణా, గోవిందా’

అచ్చింతాయం బుచ్చింతాయం.
అమ్మాయి మెళ్లో మంగళసూత్రం
ముక్కు మూసుకోవే

‘సరే.’

‘ఆ బెల్లం నైవేద్యము పెట్టవే’

‘పెళ్లికి నైవేద్యం ఏమిటిరా? కట్నాలు, లాంచనాలు ఇవ్వాలి కాని’

‘ఇది ఉత్తుత్తి పెళ్లికాదుటే......అంచేత భోజనాలే...’

‘మరి అయిందా పెళ్లి?’

‘అయిందోయ్ పెళ్లి అయిపోయిందోయ్’

‘అమ్మాయీ, మరీ, మరచిపోయేవే’

‘ఏమిటి?’

‘పళ్లెంలో వెలిగిస్తారు అది మంగళహారతా’

‘ఊ. ఔను అదీ.’

‘సరే, పళ్లెం పట్టుకురా’

‘ఇదుగో’

‘వెలిగించాను-మరి నువ్వు పాటపాడు’

‘నాకురాదు. నువ్వుపాడు’

‘మరి పాడనా? ఏమిపాడనూ?’

‘ఏదో ఒకటి పాడు’

‘సునో సునో పాడనా?’

‘ఊ. పాడు’

‘సునో సునో బనకేరాణి—రాణిహు’

‘అదివద్దే. బాగాలేదే’

‘ఇంకోకటి పాడనా?’

‘ఊ. పాడు, మంచిదిపాడు’

‘సరే. మంగళమని పాడరె మన శ్రీరామునికి మంగళం.’

—కందుకూరి లింగరాజు.